క్లుప్తంగా

ఎమ్మెల్యే పర్యటన నేడు

పులిచెర్ల(కల్లూరు)/సదుం: పుంగనూరు శాసన సభ్యులు పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి బుధవారం సదుం, పులిచెర్ల మండలాల్లో పర్యటిస్తారు. శివరాత్రి పర్వదినాన బుధవారం పులిచెర్ల మండలంలోని చిచ్చిలివారి పల్లె ఆలయానికి 8 గంటలకు, దేవళంపేట ఆలయానికి 8.15 గంటలకు, సదుం మండలంలోని అయ్యప్పస్వామి ఆలయంలోని శివాలయానికి ఉదయం 9 గంటలకు హాజరై, పూజార్చన కార్యక్రమాల్లో పాల్గొంటారని పార్టీ నాయకులు తెలిపారు.

ఎంపీ నిధులతో తాగునీటి బోరు


మినీ వాటర్ ట్యాంకును ప్రారంభిస్తున్న ఎంపీపీ రెడ్డెప్ప

సదుం: మండలంలోని జోగివారిపల్లె మారుతివారిపల్లెలో తాగునీటి బోరు కోసం రాజంపేట ఎంపీ పెద్దిరెడ్డి మిథున్ రెడ్డి నిధులు మంజూరు చేసినట్లు సర్పంచ్ అనితకుమారి తెలిపారు. ఈ నిధులతో గ్రామంలోని కణం గంగమ్మ ఆలయం వద్ద సోమవారం రాత్రి బోరు వేశారు. పుష్కలంగా నీరు పడడంతో గ్రామస్తులు హర్షం వ్యక్తం చేశారు. తాగునీటి సమస్య పరిష్కారానికి కృషి చేసిన ఎమ్మెల్యే పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, ఎంపీకి కృతజ్ఞతలు చెప్పారు.

మినీ వాటర్ ట్యాంక్ ప్రారంభం

బైరెడ్డిపల్లె: మండలంలోని గంగినాయనపల్లె సమీపంలోని పుంగనూరు రహదారిలో ఉన్న బీసీ కాలనీలో తాగునీటి సమస్య ఎంపీపీ మొగసాల రెడ్డెప్ప దృష్టికి రావడంతో ఆయన స్పందించారు. మినీ వాటర్ ట్యాంకు నిర్మించి మంగళవారం దానిని ప్రారంభించారు. వేసవిలో తాగునీటి స మస్య లేకుండా చర్యలు తీసుకుంటామని ఆయన చెప్పారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ నారాయణ స్వామి, సర్పంచులు రేణుక, వెంకటేష్, ఎంపీటీసీ వినాయకం, మండల వైఎస్సార్‌సీపీ యూత్ అధ్యక్షుడు మహేష్‌బాబు, పార్టీ నేతలు జయకుమార్‌రెడ్డి, తీర్థం కేశవులు, తబ్రాజ్, రవి, మంజునాథ్, నాగభూషణం రెడ్డి పాల్గొన్నారు.

ఆవురావురుమంటూ..!

జయంబు నిశ్చయంబు రా..
భయమ్ము లేదురా
జంకుగొంకు లేకుండా ఆరగించరా..!
మమ్మాదరించరా..!


చికెన్ ఫ్రీ..ఆఫర్ ఇచ్చేసరికి ఎగబడుతున్న జనం


చికెన్ కబాబ్ తింటూ అవగాహన కల్పిస్తున్న పౌల్ట్రీ ఫామ్ కంపెనీల ప్రతినిధులు

అని కోళ్లఫారాలోళ్లు బంపర్ ఇచ్చేసరికి జనాలు పోలోమంటూ ఎగబడ్డారు. చికెన్ కబాబ్ ముక్కలు, మసాలా వేసిన కోడిగుడ్లను ఓ పట్టు పట్టారు! ఎంకి పెళ్లి సుబ్బి చావుకొచ్చిన చందాన ఉభయ గోదావరి జిల్లాల్లో బర్డ్‌ఫ్లూ దెబ్బకు అక్కడ పౌల్ట్రీ రంగం కుదేలైంది. ఆ ప్రభావం జిల్లాపైనా పడింది. ఉమ్మడి చిత్తూరు జిల్లాల్లో బర్డ్‌ఫ్లూ లేదని అధికార యంత్రాంగం ప్రకటించినా జనాలు మాత్రం ప్రత్యామ్నాయ మాంసాహార వంటకాల వైపే మొగ్గు చూపడంతో చికెన్ అమ్మకాలు పడిపోయాయి. పరిస్థితి ఇలాగే మరికొంత కాలం సాగితే నెత్తిన గుడ్డేసుకోవాల్సిందేనని పౌల్ట్రీ ఫామ్స్ ఏజెన్సీలు ఆందోళన చెందాయి. ఈ నేపథ్యంలో చికెన్ తింటే ఏమీ కాదంటూ ప్రజలకు అవగాహన కల్పించేందుకు పూనుకున్నాయి. మంగళవారం పలమనేరులోని ఓ కల్యాణ మండపంలో 'ఉచిత చికెన్, ఎగ్ మేళా' నిర్వహించారు. ఇక చూస్కోండి నా సామిరంగా ఫ్రీ అనేసరికి..బర్డ్‌ఫ్లూ గిర్డ్‌ఫ్లూ జాన్తానై..అని జనాలు చికెన్ కబాబ్, కోడిగుడ్ల కోసం ఎగబడ్డారు. ఆవురావుమంటూ లాగించారు. వీఎస్ఎన్ ఎండీ ప్రణీత్‌కుమార్, ఎన్ఈసీ చెర్మన్ శ్రీనివాసులు నాయుడు, వీఎస్ఎన్ జీఎం రాజేంద్ర నాయుడు, స్థానిక ఎగ్ కాంట్రాక్టర్లు గాలి సుబ్రమణ్యం నాయుడు, రామచంద్రనాయుడు మాట్లాడారు. జిల్లాలో ఎక్కడగానీ బర్డ్‌ఫ్లూ లేదని, చికెన్, గుడ్లు తింటే ఆరోగ్యానికి మంచిదేనని చెప్పారు. ఇక మేళాలో 500 కిలోల చికెన్‌తోపాటు 2,500 కోడిగుడ్ల వంటకాలను జనాలు అపన్నంగా లాగించేశారు! ఇక మందుబాబులైతే ముక్కలు పట్టుకుని హుషారుగా మద్యం షాపులకు వెళ్లారు.

– పలమనేరు

సుబ్రమణ్యస్వామి ఆలయాన్ని అభివృద్ధి చేద్దాం

జెడ్పీ చైర్మన్ శ్రీనివాసులు


సుబ్రమణ్యస్వామి ఆలయ ప్రత్యేక పూజల్లో జెడ్పీ చైర్మన్ శ్రీనివాసులు, ఆలయ అభివృద్ధి దాతలు

పలమనేరు: మున్సిపాలిటీలోని టీఎస్ అగ్రహారం సుబ్రమణ్యస్వామి ఆలయాన్ని దాతల సాయంతో మరింత అభివృద్ధి చేద్దామని ఉమ్మడి చిత్తూరు జిల్లా జెడ్పీ చైర్మన్ శ్రీనివాసులు అన్నారు. ఆ ఆలయాభివృద్ధికి మంగళవారం ఆయన రూ.10వేలను అందజేశారు. ఆలయ నిర్వాహకులు, గ్రామ పెద్దలు ఆయనకు కృతజ్ఞతలను తెలిపారు. ఆలయంలో నిర్వహించిన ప్రత్యేక పూజల్లో చైర్మన్ మాట్లాడారు. ఎంతో మహిమ కలిగిన ఈ ఆలయాభివృద్ధికిగాను ఒక వాట్సాప్ గ్రూపు ఏర్పాటు చేసి పట్టణానికి చెందిన సుధీర్ లాంటి భక్తులు 62మంది కృషి చేస్తూండటం అభినందనీయమన్నారు. ఇదే రీతిలో భక్తులు తోడ్పాటునివ్వాలని కోరారు. కార్యక్రమంలో సుధీర్‌కుమార్, రెడ్డెప్పరెడ్డి, ప్రసాద్ రెడ్డి, ఈశ్వర్‌రెడ్డి, రవి, ఏరుగుత్తి బాలాజీ, సుబ్రమణ్యం గౌడు, భాస్కర్ రెడ్డి, కొండారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సారా నిర్మూలనకు నవోదయం 2.0


సమావేశంలో మాట్లాడుతున్న ఎక్సైజ్ సీఐ నాగరాజు

కుప్పం: సారా నిర్మూలనకు ప్రభుత్వం నిర్వహిస్తున్న నవోదయం 2.0 కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కుప్పం ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ సీఐ నాగరాజు కోరారు. మంగళవారం మండలంలోని దేవరాజపురంలో అవగాహన కార్యక్రమం ఏర్పాటు చేసి ఆయన మాట్లాడారు. నవోదయం 2.0 లో భాగంగా సారా నిర్మూలన కమిటీని ఏర్పాటు చేశామని, ఈ కమిటీలో సర్పంచ్, ఎంపీటీసీ, ఎంపీపీ, పాఠశాల ప్రధానోపాధ్యాయులు, వీఆర్‌ఓ, మహిళా పోలీస్, స్వయం సహాయక బృందాల సభ్యులు ఉంటారన్నారు.. ఈ కమిటీ సారా సేవనం వల్ల వచ్చే అనారోగ్య సమస్యలను అవగాహన కల్పిస్తుందన్నారు. సారా తయారీ, విక్రయం, రవాణాకు స్వస్తి పలికితే వారికి ప్రభుత్వం స్వయం ఉపాధి కల్పిస్తుందని పేర్కొన్నారు. ప్రధానంగా అటవీ సరిహద్దు ప్రాంతాల్లోసారా నిర్మూలనకు అందరూ సహకరించాలని కోరారు. కార్యక్రమంలో ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ ఎస్ఐ మోహన్‌బాబు, ప్రధానోపాధ్యాయులు రఘు, ఆర్ఐ వేణుగోపాల్ తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన జ్ఞానజ్యోతి శిక్షణ


ఆర్‌పేట ఉర్దూ పాఠశాలలో శిక్షణలో అంగన్‌వాడీ కార్యకర్తలు


శిక్షణ కార్యక్రమాన్ని తనిఖీ చేస్తున్న పథక సంచాలకులు వెంకటరమణ



శిక్షణ పొందిన అంగన్‌వాడీ కార్యకర్తలతో అధికారులు

కుప్పం రూరల్: అంగన్‌వాడీ కార్యకర్తల జ్ఞానజ్యోతి శిక్షణ కార్యక్రమం మంగళవారం ముగిసింది. 120 రోజుల శిక్షణ కార్యక్రమంలో భాగంగా మొదటి దశలో ఆరు రోజుల శిక్షణ ఆర్‌పేట ఉర్దూ పాఠశాలలో 50 మందికి కార్యకర్తలకు, బాలుర ఉన్నత పాఠశాలలో 75 మంది శిక్షణ ఇచ్చారు. వీరికి ఎంఈఓ మహబూబ్‌బాషా, మోహన్‌సింగ్, కేశవులు, మురళీకృష్ణ, దిల్‌షాద్ శిక్షణ ఇచ్చారు. చివరి రోజు అంగన్‌వాడి కార్యకర్తలు తాము నేర్చుకున్న విషయాలపై డాక్యుమెంటేషన్ ఇచ్చారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

ముగిసిన జ్ఞానజ్యోతి శిక్షణ

పలమనేరు: పట్టణంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో అంగన్‌వాడీ కార్యకర్తలకు ఆరు రోజుల జ్ఞానజ్యోతి శిక్షణ మంగళవారం ముగిసింది. ముగింపు రోజున శిక్షణ కార్యక్రమాన్ని పథక సంచాలకులు వెంకటరమణ తనిఖీ చేశారు. ఇక్కడ నేర్చుకున్న అంశాలను ప్రీ–ప్రైమరీలో సమర్థవంతంగా బోధించాలన్నారు. అంగన్‌వాడీల బోధనా సామర్థ్యాలను పెంపొందించాలనే లక్ష్యంతో మొదటి విడతగా శిక్షణ ఇచ్చినట్టు చెప్పారు. కార్యక్రమంలో ఎంఈఓలు లీలారాణి, బాలసుందరం, ఆర్‌పీలు, హెచ్‌ఎంలు పాల్గొన్నారు.

శివ పూజకు వేళాయెె..!


చెన్నారెడ్డిపల్లె సమీపంలోని కాశీవిశ్వేశ్వర స్వామి ఆలయం

పెద్దపంజాణి: మండలంలోని వివిధ ఆలయలు మహా శివరాత్రి ఉత్సవాలకు ముస్తాబయ్యాయి. మండలంలోని రాయలపేట బసవేశ్వరస్వామి, కోగిలేరు గ్రామ సమీపంలోని జలకంఠేశ్వరస్వామి, వీరప్పల్లె యోగనందీశ్వరస్వామి, బొమ్మరాజుపల్లె కాళభైరవ సమేత భైరవి, చెన్నారెడ్డిపల్లె సమీపంలోని కాశీవిశ్వేశ్వర స్వామి ఆలయాల్లో ప్రత్యేక పూజలకు అన్ని ఏర్పాట్లు చేశారు. శివాలయాలను చలువ పందిళ్లు, విద్యుద్దీపాలతో శోభాయమానంగా తీర్చిదిద్దారు. వేకువజాము నుంచి అభిషేకాలు, పూజలు, దర్శనాలు ప్రారంభమవుతాయని అర్చకులు తెలిపారు. ఆలయాల వద్ద అన్నదాన కార్యక్రమంతో పాటు పలు సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేసినట్లు ఆలయ నిర్వాహకులు తెలిపారు.

శివాలయాలు ముస్తాబు

సదుం: మండలంలోని ఎర్రాతివారిపల్లె కన్యమూల వినాయకస్వామి, మత్తుకువారిపల్లె సమీపంలోని మల్లేశ్వరస్వామి, మండల కేంద్రంలోని వీరభద్ర స్వామి, మరకతేశ్వరస్వామి, అరుణాచలేశ్వర స్వామి, పుట్టావారిపల్లె మల్లికార్జునస్వామి, పాతపేట ఎల్లమ్మ ఆలయాలలో శివరాత్రి ప్రత్యేక పూజలకు ఏర్పాటు చేసినట్టు నిర్వాహకులు చెప్పారు. పలు చోట్ల స్వామి వారి కల్యాణోత్సవం, అన్నదానం, జాగరణ భక్తుల కోసం సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేశారు.

నేటి నుంచి శివరాత్రి పూజలు

కుప్పం రూరల్: మండలంలోని హనుమన్న కొటాలులో రెండు రోజుల పాటు మహాశివరాత్రి ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్న గ్రామస్తులు తెలిపారు. బుధవారం సాయంత్రం హనుమంతరాయస్వామి, సిద్ధేశ్వరస్వామి, వీరకెంపమ్మ, తిమ్మరాయస్వామి, కుందానీలక్కమ్మలకు అభిషేకం, పుష్పాలంకరణ, దీపారాధన అనంతరం స్వామి వారికి నిలువోత్సవం, పచ్చగెరిగ, ఉత్సవ ఊరేగింపు, బాణ వేడుకలు నిర్వహిస్తామని తెలియజేశారు. గురువారం సాయంత్రం తలపై టెంకాయలు కొట్టడం, అగ్నిగుండం, మహా మంగళహారతిలో పూజలు ముగుస్తాయన్నారు.

పీహెచ్‌సీ తనిఖీ


తీర్థంలో పర్యటించిన జిల్లా టాస్క్‌ఫోర్స్ అధికారులు

బైరెడ్డిపల్లె: మండలంలోని తీర్థం పీహెచ్‌సీని మంగళవారం జిల్లా టాస్క్‌ఫోర్స్ అధికారులు ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆసుపత్రి రికార్డు లు పరిశీలించారు. పనిచేస్తున్న సి బ్బంది వివరాలు అడిగితెలుసుకున్నారు.పేద ప్రజలే ప్రధానంగా ప్రభుత్వాసుపత్రికి వ స్తుంటారని, ప్రజలకు అందుబాటులో ఉండి నాణ్యమైన వైద్యసేవలు అందించాలన్నా రు. అనంతరం మండలంలోని ఆల్లపల్లెలో ఆయుష్మాన్ ఆరోగ్య మందిర్‌లో యుక్తవయ స్సు బాలికలు, గర్భవతులు, తల్లులకు చేస్తున్న హిమోగ్లోబిన్ పరీక్షలను పరిశీలించారు. కార్యక్రమంలో డీఎస్ఓ ప్రసాద్, డీపీఓ రామ్మోహన్, వైద్యాధికారి అరుణ్‌కుమార్, హెల్త్ ఎడ్యుకేటర్ కాంతమ్మ, హెచ్ఎస్ శ్రీదేవి, ఎంఎల్‌హెచ్‌పీఎస్ సునంద పాల్గొన్నారు.

ఉత్తమ భవిష్యత్తే లక్ష్యం


విద్యార్థులకు డాక్యుమెంట్ ఫైళ్లను ఇస్తున్న వినయ్‌రెడ్డి

వి.కోట: విద్యార్థుల భవితకు కీలకమైన పదోతరగతి పబ్లిక్ పరీక్షల్లో ఉత్తమ ఫలితాలే లక్ష్యంగా చదవాలని నలంద విద్యాసంస్థల ప్రిన్సిపాల్ వినయ్ రెడ్డి అన్నారు. మంగళవారం స్థానిక బాలికల ఉన్నత పాఠశాల విద్యార్థినులకు ఆయన తమ విద్యాసంస్థల ఆధ్వర్యంలో డాక్యుమెంట్ ఫైళ్లను అందజేసి మాట్లాడారు. విద్యాసంస్థల్లో మొదటి మూడు ర్యాంకులు సాధించిన విద్యార్థులకు ఉచిత విద్యను అందిస్తున్నట్టు చెప్పారు. అందరూ ఉత్తమ ఫలితాలు సాధించి స్కూలు, గ్రామానికి పేరు తేవాలని ఆకాంక్షించారు. నాయకులు రామచంద్రనాయుడు, రంగనాథ్, కళాశాల సిబ్బంది, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.









విద్యార్థులకు చిత్రలేఖన పోటీలు


తాము వేసిన చిత్రాలను ప్రదర్శిస్తున్న విద్యార్థులు

పులిచెర్ల(కల్లూరు): విద్యార్థుల్లో శాస్త్రీయ దృక్పథం పెంపొందించేందుకు చిత్రలేఖనం పోటీలు నిర్వహించినట్లు కల్లూరు హైస్కూలు హెచ్‌ఎం శ్రీవాణి తెలిపారు. సైన్స్ దినోత్సవం పురస్కరించుకుని ముందస్తుగా మంగళవారం ఈ పోటీలు నిర్వహించారు. ఈ పోటీల వలన విద్యార్థుల్లో సృజనాత్మకత, భావ వ్యక్తీకరణ, సైన్స్‌పై మక్కువ పెరుగుతుందని పేర్కొన్నారు. కార్య క్రమంలో సైన్స్ ఉపాధ్యాయులు వెంకటసిద్ధులు, రాజేంద్ర, చంద్రబాబు, గురవయ్య, వేణుగోపాల్, రహమత్ బాషా తదితరులు పాల్గొన్నారు.

28న రుణాల ఇంటర్వ్యూలు

వి.కోట: స్వయం ఉపాధికి సంబంధించి వివిధ కార్పొరేషన్ల రుణాలను సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీఓ ఈశ్వర్‌రెడ్డి మంగళవారం ఒక ప్రకటనలో కోరారు. రుణాల కోసం దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులకు ఈ నెల 28న ఉదయం 10 గంటలకు తమ కార్యాలయంలో బ్యాంకుల వారీగా ఇంటర్వ్యూలు నిర్వహిస్తామని, అభ్యర్థులు ఆన్‌లైన్ అప్లికేషన్, ఆధార్, రేషన్ కార్డు, కుల ధ్రువీకరణ పత్రం,, బ్యాంక్ ఖాతా పుస్తకం మూడు జెరాక్సులు తీసుకురావాలని కోరారు.

నందిపై కాలభైరవుడి విహారం



తవణంపల్లె: మండల కేంద్రంలోని కాలభైరేశ్వర స్వామి మహాశివరాత్రి ఉత్సవాల్లో భాగంగా మంగళవారం రాత్రి నంది వాహన సేవను వైభవంగా నిర్వహించారు. ఉదయం కాలభైరేశ్వర స్వామికి, శివలింగానికి, నందీశ్వరునికి అభిషేకం చేశారు. గంధం, వీబూది, సుగంధ పుష్పాలు, గజమాలలతో ప్రత్యేక అలంకరణ పూజలు నిర్వహించి స్వామికి అర్చనలు చేయించారు. రాత్రి నంది వాహన సేవను నిర్వహించారు. స్వామికి పూజా సామగ్రి, ప్రసాదాలు, పండ్లు, పట్టువస్త్రాలు, గజమాలతో ఊరేగింపుగా తీసుకొచ్చి సమర్పించారు. అర్చకులు ఉత్సవమూర్తి అభిషేకం, పూజలు చేయించి ప్రత్యేక అలంకరణలు చేయించారు. సుగంధ పరిమళ పుష్పాలు, విద్యుద్దీపాలతో అలంకరించిన పల్లకిలో నంది వాహనంపై కొలువుదీరారు. పూజల అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు. నందివాహనంపై కొలువుదీరిన కాలభైరేశ్వరుడు మేళతాళాలు, మంగళవాయిద్యాల నడుమ మాడవీధుల్లో ఊరేగుతూ భక్తులకు దర్శన భాగ్యం కల్పించారు. భక్తులు స్వామికి కొబ్బరికాయలు కొట్టి, కర్పూర మంగళహారతులిచ్చి మొక్కులు చెల్లించుకున్నారు. ఈ ఉత్సవాలకు ఉభయకర్తలుగా వినాయకం, కె.వి చంద్రమోహన్ కుటుంబసభ్యులు, వినాయక, దొరబాబు కుటుంబసభ్యులు వ్యవహరించారు.

నేడు మహాశివరాత్రి వేడుకలు

ఆలయంలో నేడు మహాశివరాత్రి వేడుకలు నిర్వహించనున్నారు. ఉదయం అంకురార్పణ, కలశప్రతిష్ఠ, గణపతి హోమం, లక్షబిల్వార్చన, శివకోటి భజనలు నిర్వహిస్తారు. అనంతరం భక్తులకు అన్నదానం, కలశ పూజ, ఊరేగింపు, ప్రదోష కాలంలో నందీశ్వరునికి అభిషేకం, మృత్యుంజయ హోమం, లలితా సహస్రనామం, పూర్ణాహుతి హోమం, శివమాల భక్తుల అగ్నిగుండ ప్రవేశం, శివమాల సమర్పణ, అఖండ కర్పూర హారతితోపాటు రాత్రి 9 గంటలకు భైరవ వాహన సేవ నిర్వహించనున్నట్లు వివరించారు.





